



ఎండలిక గండమే..

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మరింత తీవ్రమైన ఎండలు
- భద్రాచలంలో 46.5, వైరా, ఖమ్మంలో 46.4 డిగ్రీలు
- కొన్ని మండలాలు మినహా 45 డిగ్రీలకు పైగానే
- రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు

ఖమ్మం, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాపై ఎండల ప్రభావం మరింత పెరిగింది. వారం నుంచి పెరుగుతున్న ఉష్ణోగ్రత బుధవారం 46 డిగ్రీలు దాటింది. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 46.5 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం జిల్లా వైరా, ఖమ్మం ఖానాపురం పోలీస్ స్టేషన్ సమీపంలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఒకటి రెండు మండలాలు మినహా మిగిలిన మండలాలన్నింటికీ అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంఘం, ఏడబ్ల్యూఎస్(ఆటోమాటిక్ వెదర్ స్టేషన్స్) ఆధారంగా రూపొందించిన మ్యాపుల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు సంబంధించిన మ్యాపులు రెడ్ అలర్ట్‌ను చూపుతున్నాయి. ఉదయం పది గంటల నుంచే భానుడు ఉగ్రరూపం దాల్చుతుండగా.. అర్ధరాత్రి వరకు వేడిగాలులు తగ్గడంలేదు. కాగా పెరిగిన ఎండల తీవ్రతకు మూగజీవాలు నీరు దొరక్క అల్లాడున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తట్టుకోలేక ప్రజలు ఏసీలు, కూలర్ల వద్దకు పరిగెడుతున్నారు. ఏసీలు సైతం మొరాయిస్తున్నాయి.

రెండు మండలాలు మినహా...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకటి, రెండు మండలాలు మినహా మిగిలిన అన్నీ మండలాల్లో 45డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 41.1 నుంచి 43 డిగ్రీల వరకు ఆరెంజ్ అలర్ట్, 43.1 నుంచి 45 డిగ్రీల వరకు లైట్ రెడ్, 45.1 నుంచి 47 వరకు పూర్తి రెడ్ అలర్ట్‌లో ఉంటాయి. అలా ప్రణాళిక విభాగం అధికారులు విడుదల చేసిన మ్యాపుల ప్రకారం ఖమ్మం జిల్లాలోని ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి, కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు, ఎర్రుపాలెం, వైరా, తల్లాడ, కొణిజర్లలోని కొన్ని ప్రాంతాలు పూర్తి రెడ్ అలర్ట్‌లో ఉండగా.. మిగిలిన మండలాలు లైట్ రెడ్ అలర్ట్ పరిధిలో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో దమ్మపేట, అశ్వారావుపేట ఆరెంజ్ అలర్ట్‌లో ఉండగా.. చర్ల, పినపాక, మణుగూరు, అశ్వాపురం, దుమ్ముగూడెం, పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, చండ్రుగొండ, జూలురుపాడు ప్రాంతాలు రెడ్ అలర్ట్‌లో ఉండగా.. కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి ప్రాంతాలు లైట్‌రెడ్‌లో ఉన్నాయి.

వేగంగా ఉష్ణోగ్రతలు..

ఉష్ణోగ్రతల తీవ్రత వేగంగా పెరుగుతున్నట్టు తెలుస్తుండగా.. అధికారుల అంచనాలను సైతం దాటిపోయినట్టు స్పష్టమవుతోంది. గతంలో ఉన్న పరిస్థితులను అంచనా వేస్తూ రాబోయే రోజుల్లో ఎంతటిస్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయో తెలుపుతూ రాష్ట్ర ప్రణాళిక విభాగం వారు ప్రతీవారం బులెటిన్ విడుదల చేస్తూ ఉంటారు. అందులో భాగంగానే సంబంధిత శాఖ అధికారులు ఏప్రిల్ 26న తర్వాత వారం రోజులకు సంబంధించిన బులెటిన్‌లో 41 నుంచి 45 డిగ్రీల వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. కానీ బులెటిన్ విడుదల చేసిన రెండురోజుల్లోనే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 46డిగ్రీలు దాటి నమోదవడం.. ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయనడానికి నిదర్శనం.





టేకులపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కేంద్రంలోనూ కాంగ్రెస్ రావాలి

అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది

- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్
- ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆరు గ్యారంటీల అమలు
- మహబూబాబాద్‌లో బలరాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- మంత్రి తుమ్మల
- టేకులపల్లిలో హోరెత్తిన బహిరంగసభ

7



మామ కోసం

కోడళ్లు

హీరో వెంకటేష్ కుమార్తె ఆశ్రిత, పొంగులేటి కుమార్తె సప్నిరెడ్డి ఎన్నికల ప్రచారం

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 1: లోక్‌సభ ఎన్నికల్లో తన మామ విజయం కోసం కోడళ్లు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఖమ్మం లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న రామసహాయం రఘురాంరెడ్డి విజయం కోసం ఆయన పెద్ద కోడలు, హీరో వెంకటేష్ కుమార్తె రామసహాయం ఆశ్రిత, చిన్నకోడలు, పొంగులేటి కుమార్తె సప్నిరెడ్డి బుధవారం ప్రచారం చేశారు. ఖమ్మంలోని పోలీసు హౌసింగ్ కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆశ్రిత పాల్గొని తన మామాగారైన రఘురాంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జేబి స్వర్ణకుమారి, రాయల నాగేశ్వరరావు, జావీద్, బాలసాని లక్ష్మీనారాయణ, డాక్టర్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.





నేలకొండపల్లిలో రోడ్‌షోలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, హాజరైన ప్రజలు

బీజేపీ, బీఆర్ఎస్‌లను

బొంద పెట్టాలి

రూ.లక్షన్నర కోట్లు దోచుకున్న కేసీఆర్

- ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటాం
- ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నేలకొండపల్లిలో అభ్యర్థి రఘురాంరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం

నేలకొండపల్లి, మే 1: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను బొందపెట్టాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధనికరాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చి కేసీఆర్ రూ.లక్షన్నర కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఖమ్మం అభ్యర్థి రామసహాయం రాఘురాంరెడ్డితో కలిసి నేలకొండపల్లిలో రోడ్‌షో నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ అంటకాగాయన్నారు. దేశంలో మతం, కులాన్ని రెచ్చగొడుతూ బీజేపీ శ్రీరాముడిని రాజకీయాల్లోకి లాగి లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ఏ హామీని బీజేపీ నిలబెట్టుకోలేదన్నారు. 'నేను కొట్టినట్లు చేస్తా.. నువ్వు ఏడ్చినట్లు చెయ్యి' అని ఇద్దరూ నాటకం ఆడుతున్నారన్నారు. ప్రజలను మోసగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను లోక్‌సభ ఎన్నికల్లో బొందపెట్టాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా కేసీఆర్ తెలంగాణకు శనిలా దాపురించాడని వ్యాఖ్యానించారు. మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలతో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులకుప్పగా తయారు చేశాడన్నారు. రూ.7.50లక్షల కోట్ల అప్పులు చేసి అందులో రూ.1.50లక్షల కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఏనాడూ ప్రజల బాధలు పట్టించుకోని కేసీఆర్ ఇప్పుడు బస్సుయాత్ర పేరుతో తిరుగుతూ మొసలికన్నీరు కారుస్తున్నాడన్నారు. రాష్ట్రంలో ఒక్క సీటూ గెలవలేని కేసీఆర్ ఖమ్మంలో నామాను గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పి నామాను కేంద్ర మంత్రిగా చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ చేసిన ఈ ప్రకటనతో బీజేపీతో తమకు ఉన్న బంధాన్ని చెప్పకనే చెప్పాడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా ఆగస్టు 15లోపు రూ.2లక్షల రైతు రుణమాఫీని చేసి చూపిస్తామన్నారు. ఎన్నికల తరువాత అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో తాను ప్రతి గ్రామానికి రాలేకపోతున్నానని, కానీ 15వ తేదీ నుంచి ప్రతి మండలానికి ఒక రోజు కేటాయిస్తానన్నారు.

ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ కేసీఆర్, మోదీ ఒక్కటేనన్నారు. దేశం బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ఖమ్మం స్థానం నుంచి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు బొందయ్య, నాయకులు మైసా శంకర్, వెన్నపూసల సీతారాములు, మామిడి వెంకన్న, కుక్కల హనుమంతరావు, గోళ్ల శ్రీనివాసరావు, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా

మళ్లీ కొత్వాల

- గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా తూము వీరభద్రరావు

7



వైరాలో బీఆర్ఎస్‌కు

భారీ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు

6

రూ.100 కోట్లతో మోడల్‌గా

ఖమ్మం మార్కెట్

- కర్షక, కార్మిక సంక్షేమం కోసం కృషి
- మంత్రులు తుమ్మల, పొంగులేటి
- 2వేల మంది కార్మికులు ఐఎన్‌టీయూసీలోకి

6



మళ్లీ మీ సహకారం కావాలి

- లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వండి..
- టీడీపీ నాయకులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భేటీ
- ఎన్టీఆర్‌కు భారతరత్న ఉద్యమానికి మద్దతు



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

మరోసారి అవకాశం ఇవ్వండి..

అభివృద్ధి చేస్తా

బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం, మే1: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో రెండుసార్లు తనను జిల్లా ప్రజలు ఆదరించారని, మరోసారి అవకాశం ఇస్తే జిల్లా ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాకరవాయి, రాజారం, బీరోలు, పిండిప్రోలులో సభల్లో ప్రసంగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి మేలు జరిగిందన్నారు. నేడు కాంగ్రెస ప్రభుత్వ పాలనలో ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అమలుకాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించి ప్రజలనుమోసం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయరంగానికి 24గంటలు కరెంట్ ఇచ్చామని నేడు విద్యుత్ కోతలతో ప్రజలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేస్తే రాష్ట్రం నాశనమవుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి స్థానికుడు కాదని, ఈ జిల్లా బిడ్డను ఆదరించాలనికోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్న, ఆలస్యం నాగేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి, రవి, మౌనిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోదీని ఇంటికి పంపటమే

మే డే విజయం

- కార్పొరేటీకరణతో కార్మికుల హక్కుల తొలగింపు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 1: చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం పోరాటం చేసి సాధించిన మే డే తర్వాత కాలంలో ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమ పోరాటాల విజయాలకు, కార్మికుల హక్కుల చట్టబద్ధతకు పునాదులు వేసిందని, అయితే భారతదేశంలో మోదీ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్‌లు కార్పొరేటీకరణ జరగటంతో పరోక్షంగా కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారని అందుకే మోదీని ఇంటికి పంపటమే మే డే విజయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. బుధవారం మేడే సందర్భంగా ఖమ్మం గాంధీచౌక్‌లో నిర్వహించిన బహిరంగ సభలో తమ్మినేని ప్రసంగించారు. పదేళ్ల మోదీ పరిపాలనలో కేంద్ర కార్మిక హక్కుల చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులు తిరిగి రోజుకు 12గంటలు పనిచేయాల్సి వస్తోందన్నారు. కార్మికులు సెలవు రోజులను తొలగించి కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని పలు కూడాల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. రాష్ట్ర నాయకులు ఎం సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం



ప్రసంగిస్తున్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు, పక్కన మాజీ మంత్రి విజయరామారావు

ఆరు గ్యారెంటీలతో

మోసపోయిన ప్రజలు

బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు

కల్లూరు, మే 1: కాంగ్రెస్ ఇస్తున్న హామీలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని, ఆరు గ్యారెంటీలతో ప్రజలు మోసపోయారని బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. కల్లూరులో బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కేంద్రంలో సంక్షేమం, నిజాయితీగా పాలన అందించేది ప్రధాని నరేంద్ర మోదీయేనన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో ప్రజలు మోసపోయారని ఇక పార్లమెంట్ ఎన్నికల్లో నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. దేశంలో సుస్థిర పాలన అందిసున్న బీజేపీ ప్రభుత్వం వైపు తిరిగి ఈ ఎన్నికల్లో ప్రజలు మొగ్గుచూపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలో రైతుల రుణమాఫీ, తులం బంగారం ఎక్కడకు పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఈ ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులను నిగ్గదీయాలని తాండ్ర ప్రజలకు పిలుపు నిచ్చారు. రిజర్వేషన్లను రద్దు చేస్తున్నట్లు తప్పుడు వీడియోలు సృష్టించి అమిత్‌షాపై అవాస్తవమైన ప్రచారం చేయటం కాంగ్రెస్ నాయకులకు తగదన్నారు. సమావేశంలో మాజీ మంత్రి విజయరామారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాదిగ, సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, నాయకులు గుమ్మ రామకృష్ణ, తుమ్మలపూడి పెద్దపుల్లారావు, గుండపునేని అనిల్, నరసింహారావు బుర్రీ వెంట్రారామారావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఔరా.. తుమ్మలపల్లి..


నందకిశోర్


ఎ. బుద్ధయ్య


సుమలత


శ్యామ్‌లాల్


వెంకటేశ్వర్లు


రవి


» కుగ్రామం నుంచి ఎంపీ ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు

పెనుబల్లి, మే 1: దేశవ్యాప్తంగా జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెనుబల్లి మండలంలోని కుగ్రామమైన తుమ్మలపల్లి నుంచి ఆరుగురు అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. సుమారు 1,084మంది జనాభా, 813మంది ఓటర్లు ఉన్న తుమ్మలపల్లి గ్రామం నుంచి ప్రస్తుత ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో ఆగ్రామంలో సందడి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 12లోక్‌సభ స్థానాలకు 12మంది నామినేషన్లు దాఖలు చేయగా వారిలో ఆరుగురు ఉపసంహరించుకోగా బరిలో మరో ఆరుగురు మిగిలారు. వీరిలో మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ నుంచి తల్లాడ వెంకటేశ్వర్లు, మెదక్ నుంచి న్యాయవాది తల్లాడ నందకిషోర్, వరంగల్ నుంచి అంబోజు బుద్దయ్య, పెద్దపల్లి నుంచి అంబోజు సుమలత, నాగర్‌కర్నూల్ నుంచి అంబోజు రవి పోటీచేస్తుండగా పక్కగ్రామమైన గంగదేవిపాడు నుంచి శ్యామ్‌లాల్‌నాయక్ ఆదిలాబాద్ నుంచి పోటీలో ఉన్నారు. వీరంతా ఆధార్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇదే గ్రామానికి చెందిన వారు పోటీచేసి రాష్ట్ర వ్యాప్తంగా లక్ష పైచిలుకు ఓట్లు సాధించినట్లు ప్రముఖ న్యాయవాది, ఆగ్రామ వాసి అయిన ఈడా శేషగిరిరావు తెలిపారు.

ఐదు జిల్లాల్లో పాగా..

» మహబూబాబాద్ ఎంపీ స్థానానికి అధిక పరిధి
» సమస్యాత్మక ప్రాంతాల లోగిలి
» సంక్లిష్ట భౌగోళిక ప్రాంతం

ఇల్లెందు, మే 1: రాష్ట్ర విభజనకు పూర్వం ఎస్టీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానంగా ఉన్న భద్రాచలం స్థానంలో డీలిమిటేషన్ మూలంగా 2008లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడింది. ఈ సెగ్మెంట్‌లో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు ఉన్నాయి. ఐదు జిల్లాల పరిధిలో అత్యధికంగా ఏజెన్సీ ప్రాంతాలతో రాష్ట్రంలోనే సంక్లిష్టమైన భౌగోళిక ప్రాంతం కావడం గమనార్హం. వరంగల్, మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధి లోని 45మండలాలు, 7మునిసిపాలిటీలతో మహబూబాబాద్ ఎస్టీ లోక్‌సభ స్థానం రూపుదాల్చింది. 2008 వరకు గిరిజన రిజర్వుడు నియోజకవర్గంలో ప్రస్తు త భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్లు విభజనకు గురైన ఆంధ్రప్రదేశ్‌లోని అసెంబ్లీ స్థానాల్లో అంతర్భాగంగా ఉండేవి. అయితే 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్-4 ద్వారా ఏర్పడిన డీలిమిటేషన్ కమిషన్ 1971 జనాభా సెన్సెస్ ప్రాతిపాదికన నూతనంగా లోక్‌సభ, శాసన సభ నియోజకవర్గాలను ఏర్పాటు చేయాల్సి ఉండటంతో కమిటీ సిఫారసు మేరకు భద్రాచలం, కొత్తగూడెం జిల్లాలోని పినపాక, భద్రాచలం, ఇల్లెందు, వరంగల్ జిల్లాల్లోని నర్సంపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని డోర్నకల్, మానుకోట, ములుగు జిల్లాల్లోని ములుగు అసెంబ్లీ సెగ్మెంట్లతో మానుకోట లోక్‌సభ ఎస్టీ స్థానం ఏర్పాటయింది. నాలుగు జిల్లాల పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లతో ఏర్పడిన మహబూబాబాద్ స్థానం పరిధిలో ఐదు జిల్లాలకు చెందిన మండలాలు ఉండటం గమనార్హం. ఫలితంగా లోక్‌సభ నియోజకవర్గాల భౌగోళిక పరిధి అసెంబ్లీ సెగ్మెంట్‌ల్లో మార్పులుచేర్పులు జరుగుతున్నప్పటికీ మానుకోట తాజా లోక్‌సభ నియోజక వర్గం పరిధిలోని మండలాలకు ప్రజలకు గతంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల ఎంపీలు ప్రాతినిధ్యం వహించడం విశేషం. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని జిల్లాలోని ఇల్లెందు, అశ్వారావుపేట శాసనసభ నియోజకవర్గాలు గతంలో ఖమ్మం ఎంపీ పరిధిలో ఉండగా పినపాక, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్లు భద్రాచలం ఎంపీ పరిధిలో ఉండేవి. మహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ స్థానాలు వరంగల్ జిల్లా పరిధిలోఉన్న నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లోని వరంగల్ ఎంపీ ప్రాతినిధ్యం ఉండేది.



ఓటు హక్కు విలువపై అశ్వారావుపేటలో పోలింగ్ కేంద్రాల వద్ద గోడలపై రాతలు





- అశ్వారావుపేట రూరల్


ప్రసంగిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పదవుల కోసం .. రాజ్యాంగాన్నే మారుస్తారట

» బీజేపీవి హాస్యాస్పద హామీలు
» కేసీఆర్ మాటలు ప్రజలు విశ్వసించరు
» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఆళ్లపల్లి/ గుండాల, మే 1: బీజేపీ నాయకులు తమ రాజకీయ పదవుల కోసం రాజ్యాంగాన్నే మారుస్తామనే హాస్యాస్పద హామీలకు దిగజారారని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారి ఆటలు చెల్లవన్న భయంతో మతితప్పిన హామీలు ఇస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రచార సభల్లో మాట్లాడారు. గత పదేళ్లలో తెలంగాణ ప్రజలు కేసీఆర్ మాటలు నమ్మి మోసపోయారని, మళ్లీ ఆ పరిస్థితి రాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, ప్రతీ కార్యకర్త ఆదే ఉత్సాహంతో పనిచేసి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. ఏజెన్సీ గిరిజనులకు సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో తాను మంత్రిగా కొనసాగిన ప్రతీసారి అధిక నిధులు గుండాల ప్రాంతానికి కేటాయించానని అన్నారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సేవచేసే భాగ్యం దక్కిందని గుర్తుచేశారు. గుండాల మండలంలో కరెంట్, విద్యుత్ సౌకర్యం లేని రోజుల్లో కాలి నడకన గుండాల చేరుకొని ఎన్టీ పార్టీ సహకారంతో 1986లో గుండాల మండలానికి విద్యుత్, బస్సు సౌకర్యం తీసుకువచ్చానని గుర్తు చేశారు. ఈ సమావేశాల్లో పినపాక ఎమ్మెలే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, సీపీఐ రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీ

ఖమ్మం కలెక్టరేట్, మే 1: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు వైరా అసెంబ్లీ సెగ్మెంట్, అదనపు ఈవీఎంల మొదటి దశ తనిఖీ బుధవారం నిర్వహించినట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎం గోడౌన్‌లో చేపట్టిన ఈవీఎంల ఫస్ట్ లెవల్ తనిఖీని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణకు 3 బ్యాలెట్ యూనిట్‌ల అవసరం ఉందని, అదనపు ఈవీఎంలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవో, ఓపీవోల పాత్ర ఎంతో కీలకమని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. బుధవారం ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పాలేరు, మధిర, సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల పీవో, ఏపీవో, ఓపివో లకు చేపట్టిన శిక్షణ కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి తనిఖీ చేశారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మం కలెక్టరేట్, మే 1: లోక్ సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం ఆయన ఇతర ఉన్నతాధికారులతో కలిసి బ్యాలెట్ పేపర్ ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నూతన జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభిలతో కలిసి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ చంద్రుగొండ, మే1: పలువురు నాయకులు మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ ఉద్యమకారుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు, లగడపాటి రమేష్‌చంద్, ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు గిరీష్, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, మెదరమెట్ల వెంకటేశ్వరరావు, చంద్రుగొండ మండలానికి చెందిన తాళ్లూరి వెంకటేశ్వరావు, తిప్పనపల్లి ఎంపీటీసీ లంకా విజయలక్ష్మికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

'అడవి' నుంచి హస్తినకు..

» సర్పంచ్ నుంచి ఎంపీ వరకు సోడే రామయ్య ప్రస్థానం
» ఐదు దశాబ్దాల పాటు సాధారణ రాజకీయ జీవితం
» మూడుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నిక



భద్రాచలం, మే 1: ఏజెన్సీ ప్రాంతం నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన ఆదివాసీ నాయకుడు సోడే రామయ్య. రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. అనంతరం పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేసి ఓటమి పాలైనా పట్టుదల వీడకుండా పోటీ చేసి గెలిచారు. మూడుసార్లు భద్రాచలం లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కూనవరం మండలంలోని కొండ్రాజుపేట గ్రామం(నేడు ఏపీ పరిధిలో ఉన్నాయి.)లో ఆయన 1943 జూలై 13న జన్మించారు. కోయ గిరిజన తెగకు చెందిన సోడే రామయ్య మెట్రిక్యులేషన్ విద్య అనంతరం కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన అనేక ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొని అనతి కాలంలో నే నాయకుడినిగా గుర్తింపు పొందారు.

సర్పంచ్ నుంచి ప్రస్థానం..

సోడే రామయ్య రాజకీయ జీవితం ఐదు దశాబ్దాలు క్రితం ప్రారంభమైంది. 1962లో తొలిసారిగా తన స్వగ్రామమైన కొండ్రాజుపేట సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ప్రజా సేవ ప్రారంభించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో చూపిన చొరవ ఆయన సుదీర్ఘ కాలం పాటు సర్పంచ్‌గా కొనసాగేలా చేసింది. 19 సంవత్సరాలు సర్పంచ్‌గా ఆయన పని చేసారు. 1981లో కూనవరం పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

> భద్రాచలం ఏజెన్సీ నుంచి హస్తిన వరకు ఆయన ప్రయాణం సాగింది. తొలినాళ్లలో సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆయన మూడుసార్లు భద్రాచలం నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఐదు దశాబ్దాల పాటు సాగిన ఆయన రాజకీయ జీవితం అత్యంత సాదాగా సాగింది. ఆడంబరాలకు దూరంగా సౌమ్యుడిగా అందరితో కలిసిపోయే నాయకునిగా రామయ్యకు పేరుంది. గిరిజన గిరిజనేతరుల ఐక్యతను కోరే నాయకుల్లో ఆయన కూడా ఒకరు.

మూడుసార్లు ఎంపీ..

సోడే రామయ్య భద్రాచలం లోక్‌సభ స్థానం నుంచి మూడుసార్లు సభ్యుడిగా ఎన్నికయ్యారు. తొలిసారిగా 1967లో భద్రాచలం లోక్‌సభస్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1977వ సంవత్సరంలో మళ్లీ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోస్థానం సాధించారు. 1984లో మిత్రపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికల రంగంలోకి దిగి సోడే రామయ్య తొలిసారిగా ఎంపీగా విజయం సాధించారు. 1989లో ఓటమి పాలయ్యారు. 1991, 1996లో భద్రాచలం ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఎంపీగా పని చేసిన సమయంలో షెడ్యుల్డు తెగల సంక్షేమ కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ సలహా కమిటీసభ్యులుగా, రైల్వే సలహాకమిటీల్లో సభ్యుడిగా పని చేశారు. 50వ భారత స్వాతంత్రోత్సవాల్లో 1997లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో సెప్టెంబరు ఒకటో తేదీన సోడే రామయ్య ఎంపీగా తెలుగులోనే భద్రాచలం నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించారు.

రూ.100కోట్లతో మోడల్‌గా ఖమ్మం మార్కెట్


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

» కర్షక, కార్మిక సంక్షేమం కోసం కృషి
» మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం మార్కెట్, మే 1: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను దేశంలోనే నెంబర్ వన్ మోడల్ మార్కెట్‌గా నిర్మించి అభివృద్ధి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్మిక సంఘం అధ్యక్షుడు నున్నా మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ఎక్కడైనా మార్కెట్‌ను నిర్మించాలంటే ఖమ్మం మార్కెట్‌ను నమూనాగా తీసుకునే విధంగా రూ.100కోట్లతో రూపకల్పన చేస్తానన్నారు. ఇక్కడ మార్కెట్‌లో పని చేసే కార్మికులను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా మోడల్ మార్కెట్ నిర్మాణంలో భాగంగా రైతులకు, వ్యాపారులకు, కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కార్మికులను కోరారు.

అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కార్మికులకు అన్ని రకాలుగా అండగా ఉంటుందని, కార్మికులు, రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తూ వారి హక్కులు కాపాడతానన్నారు. కార్మికులకు ఎటువంటి ఆపద వచ్చినా ఆదుకుంటానన్నారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల, పొంగులేటి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుమారు రెండువేల మంది కార్మికులను బీఆర్ఎస్‌కేవీ కార్మిక సంఘం నుంచి ఐఎన్‌టీయూసీలోకి జెండా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిశోర్, కార్మిక సంఘం నాయకులు నున్నా మాధవరావు, ఆవుల శ్రీనివాసరావు, సాదె శంకర్, కొత్తా సైదిరెడ్డి, ఎర్రా రామిరెడ్డి, ఎస్‌కే పాషా, వడ్డె వెంకన్న తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి

» బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు


మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్/ లక్ష్మీదేవిపల్లి, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని ఎం. వెంకటాయాపాలెం, పెద్దతండా గ్రామాల్లో బుధవారం నామా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రె స్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకకరెంట్ కోతలు ఎక్కువ అయ్యాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయినట్లు ఈ ఎన్నికల్లో మోసపోవద్దని అన్నారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణా అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. కొత్తగూడెంలోని ప్రకాశం మైదానం, ప్రగతి మైదానం, లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్కులో మార్నింగ్ వాకర్స్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, ఎంపీపీ బెల్లం ఉమా, జడ్పీటీసీ సభ్యుడు యండపల్లి వరప్రసాద్, బెల్లం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పొంగులేటి శ్రీమతి


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి మాధురి బుధవారం లక్ష్మీదేవిపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. - లక్ష్మీదేవిపల్లి

మళ్లీ మీ సహకారం కావాలి...

» లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వండి..
» టీడీపీ నాయకులతో మంత్రి పొంగులేటి భేటీ

ఖమ్మం మామిళ్లగూడెం, మే 1: 'మీ సహకారం మళ్లీ కావాలి.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మీరు మీ కార్యకర్తలు చేసిన కృషి ప్రశంసనీయం.. లోక్‌సభ ఎన్నికల్లోనూ మీరు బలపరచాలి' అంటూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీడీపీ నాయకులను కోరారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మంలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని గత 74రోజులుగా ఎన్టీఆర్ అభిమాని, ఖమ్మం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టుకార్డుల ఉద్యమానికి వారు సంఘీభావం తెలిపారు. పోస్టుకార్డుపై కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతకాలు చేసి పోస్టు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో బీఆర్ఎస్‌ను మట్టి కరింపించామన్నారు. ఇదే స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి మద్దతునివ్వాలని కోరారు. గత ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు అకుంఠిత దీక్షతో కాంగ్రెస్ విజయానికి కృషిచేశారన్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి విజయానికి తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. టీడీపీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించడానికి కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో నిర్వహించే పాత్రపై మరో రెండురోజుల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండబాల కరుణాకర్, కూచిపూడి జై, కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయ్‌బాబు, బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


తాండ్ర వినోదరావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

'కమలం'తోనే ఖమ్మం ప్రగతి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

ఎర్రుపాలెం/ మధిర, మే 1: ఖమ్మం జిల్లా అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని ఆపార్టీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. బుధవారం ఎర్రుపాలెం, మధిరలో ఎన్నికల ప్రచార రోడ్‌షోలలో ఆయన మాట్లాడారు. మాయ మాటలు, బూటకపు హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఒకసారి మోసంచేసిందని, పార్లమెంట్ ఎన్నికలతో రెండోసారి మోసం చేసేందుకు ప్రజల్లోకి వస్తోందని అన్నారు. తనని గెలిపిస్తే ఖమ్మం జిల్లాని ప్రగతిపథంలో నడిపిస్తానన్నారు. మధిరలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కళ్యాణమండపంలో వినోద్‌రావును సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

వైరాలో బీఆర్ఎస్‌కు భారీ షాక్

» కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు

వైరా, మే 1: బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. పలువురు బీఆర్ఎస్ ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, వందలాదిమంది కార్యకర్తలు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. తొలుత ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు... నారపనేనిపల్లిలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి వందలాదిమంది తమ అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు.

నారపనేనిపల్లి మాజీ సర్పంచ్ శీలం సుజాత, ఆమె భర్త ముసలిమడుగు ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో చేరికలు సాగాయి. వైరా ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పసుపులేటి మోహన్‌రావు, ముసలిమడుగు, సిరిపురం ఎంపీటీసీ సభ్యులు శీలం వెంకట్రామిరెడ్డి, మట్టూరి కృష్ణారావు, పూసలపాడు సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గాలి శ్రీనివాసరావు, గారపాటి గోపాలరావు, సొసైటీ డైరెక్టర్‌లు, వైరా మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్. బీబా, గరికపాడు సొసైటీ డైరెక్టర్ మేరుగు రత్నరాజు, రెబ్బవరం, నారపనేనిపల్లి మాజీ సర్పంచ్‌లు సాధం రామారావు, శీలం సుజాత, మోదుగు తిరుమలరావు, ముసలిమడుగు మాజీ ఎంపీటీసీ తడికమళ్ల నాగేశ్వరరావు, తాటిపూడి మాజీ ఉపసర్పంచ్ మన్నెం సత్యానందం, బీఆర్ఎస్ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు వేల్పుల మురళి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి విజయం కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కోడ్ ముగియగానే రూ. రెండు లక్షల రుణమాఫీ

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


తల్లాడలో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు/ ఖమ్మం రూరల్/ తల్లాడ, మే1: ఎన్నికల కోడ్ ముగియగానే రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ఇళ్ల నిర్మాణ పథకం చేపడతామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఏన్కూరు, ఖమ్మం రూరల్, తల్లాడ మండలాల్లో ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డితో కలిసి భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను పాతిపెట్టాలని అన్నారు. కులాలు,మతాల మధ్య చిచ్చు పెట్టి మరోసారి అధికారంలోకి రావడం కోసం బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి రాహుల్‌ను ప్రధాని చేయడానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడుతానని అన్నారు. ఏదులాపురం నుంచి ముత్తగూడెం, తాళ్లేసితండా, సత్యనారాయణపురం, చిన్నతండా, నాయుడుపేట, పెద్దతండా మీదుగా వరంగల్‌క్రాస్ రోడ్డు వరకు మే డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'మాజీ'ల తేనీటి విందు


ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం వెళ్లిన మాజీ సీఎం కె. చంద్రశేఖర్‌రావు బుధవారం పాల్వంచలోని మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లారు. అక్కడ తేనీరు స్వీకరించారు. - కొత్తగూడెం

రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేసి
కార్యకర్త మొక్కు తీర్చిన ఎమ్మెల్యే


పాదయాత్రగా వెళ్లి ఆలయంలో మొక్కు చెల్లించి ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మే 1: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ బుధవారం రెండు కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్లి కాంగ్రెస్ కార్యకర్త తోటకూర గోపి మొక్కును అయ్యప్ప స్వామి ఆలయంలో తీర్చారు. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాందాస్‌నాయక్ విజయాన్ని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుతూ గోపి అయ్యప్పస్వామికి మొక్కు కట్టాడు. అయితే కార్యకర్త గోపి కోరిక ప్రకారం రాందాస్‌నాయక్ గెలవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. వైరాలోని తమ క్యాంపు కార్యాలయం నుంచి గోపి, నాయకులు, కార్యకర్తలతో కలిసి రెండు కిలోమీటర్లు అయ్యప్పస్వామి ఆలయం వరకు పాదయాత్రగా ఎమ్మెల్యే వెళ్లి స్వామివారికి మొక్కు చెల్లించారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. ఆయన వెంట వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ వైస్ఎంపీపీ కట్ల రంగారావు, వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, బోళ్ల గంగారావు, రాంపూడి రోశయ్య, పమ్మి అశోక్ పాల్గొన్నారు.


బీటీపీఎస్‌లో వెట్టి


మణుగూరు బీటీపీఎస్

- శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులు
- ఈఎస్ఐ, ఈపీఎఫ్‌ల ఊసేలేదు
- పట్టించుకోని లేబర్, బీటీపీఎస్, జెన్కో అధికారులు

మణుగూరుటౌన్, మే 1: రాష్ట్రంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. బీటీపీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కార్మిక చట్టాలు, కనీస వేతన చట్టం, కార్మిక సంక్షేమ పథకాలు వర్తించవు. ఒక్కో కార్మికుడు 12 గంటల పని భారంతో పాటు వేతనం కోసం రెండు మూడు నెలలు వేచి చూడాల్సి దుస్థితి ఏర్పడింది. ఇక ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఊసే లేదు. కార్మికులు తమ సమస్యలపై కాంట్రాక్టర్‌ను లేదా బీటీపీఎస్ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే అలా ప్రశ్నించిన వాడి ఉద్యోగం ఊడినట్లే.. ఇంతలా శ్రమ దోపిడీకి గురవుతున్నా ఇదేంటని అడిగే నాధుడే లేడు. ఇది సరిపోదన్నట్లు ప్లాంట్ వైద్యశాలలో కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య సేవలు నిలిపేశారు. కాంట్రాక్టు కార్మికులకు వైద్య సేవలు చేయద్దంటూ ఏకంగా ఓ పోస్టర్‌నే వైద్యశాల వద్ద ఏర్పాటు చేశారు. ఈ మేరకు సర్క్యులర్ కూడా జారీ చేశారు. ఇంత జరుగుతున్నా కార్మిక శాఖ అధికారులు, లేబర్ ఆఫీసర్లు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

బీటీపీఎస్‌లో కనిపించని కార్మిక చట్టాలు..



వైద్య సేవలందిచబడవు అంటూ వెలిసిన పోస్టర్

మణుగూరు బీటీపీఎస్‌లో కార్మిక చట్టాల అమలు ఊసేలేదు. కనీసం వేతనం, పనిభారంపై ఎవరైనా ప్రశ్నిస్తే వారికి ఏదో ఒకసాకుతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని కార్మికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని భారంతో ఎంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని, తద్వారా ప్రమాదాల బారిన పడిన సఘటనలున్నాయని వాపోతున్నారు. ఈ విషయంపై కార్మికశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడే లేడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాంట్ నిర్మాణ సమయంలో కనీస వేతనాలు అమలు చేస్తామని హామినిచ్చిన కాంట్రాక్టర్లు ఆ తరువాత దీనిపై స్పందించిన దాఖలాలు లేవని కార్మికులు వాపోతున్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటివరకు ఈఎస్ఐ హెల్త్‌కార్డులు, ఈపీఎఫ్ పథకం అమలులో లేదు. ఇదిలా ఉండగా ప్లాంట్‌లో జరిగిన ప్రమాదాల విషయంలోనూ వెలుగోలోకి వచ్చినవి కొన్ని మాత్రమేనని, వెలుగులోకి రాకుండా మరుగున పడినవి అనేకం ఉన్నాయన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతున్నారు.

వైద్య సేవలు బంద్..

బీటీపీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇన్నాళ్లుగా అందిస్తున్న వైద్య సేవలకు బ్రేక్ పడింది. ఈ మేరకు ప్లాంట్ అధికారులు ఒక సర్క్యులర్‌ను జారీ చేయడంతోపాటు ఏకంగా ఆసుపత్రి ఎదుట కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యసేవలు అందించకూడదంటూ ఓ బోర్డును ఏర్పాటు చేశారు. పనిభారం, కనీస వేతన సమస్య, సంక్షేమ పథకాల అమలు సమస్యలతో సతమతమవుతున్న కాంట్రాక్ట్ కార్మికులకు వైద్యసేవలు బంద్ నిర్ణయం మరీ ఇబ్బందికరంగా మారింది. తామంటే కార్మిక శాఖ అధికారులతోపాటు బీటీపీఎస్ అధికారులకు చిన్నచూపుగా ఉందని కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీటీపీఎస్ సీఈ బిచ్చన్నను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అభివృద్ధి పరుగులు పెట్టాలంటే...
కేంద్రంలోనూ కాంగ్రెస్ రావాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


టేకులపల్లిలో మంత్రి తుమ్మల సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

టేకులపల్లి, మే 1: రాష్ట్రంతో పాటు మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలో గతంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా జరిగిన అభివృద్ధి ఏమీలేదని, ఆ నిలిచిన అభివృద్ధి పరుగులు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో కూడా అధికారంలో ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో బుధవారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బలరాంనాయక్ గెలుపుతోనే ఈ ప్రాంత అభివృద్ధి ముడిపడి ఉందని, ప్రజలు గుర్తించి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే రాహుల్‌కు ప్రధానిగా అవకాశం ఇవ్వడం ద్వారానే జరుగుతుందన్నారు. ఆగస్టు 15 వరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత నాలుగు నెలల కాలంలో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలలో ఐదు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్‌కు 60వేల మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈ సభలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీపీ అధ్యక్షురాలు భూక్యా రాధతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి తుమ్మల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్యా దళ్‌సింగ్ నాయక్, బాలాజీ నాయక్, ఏలారి కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు భూక్యా దేవా నాయక్, సీపీఐ జిల్లా నాయకులు గుగులోతు రాంచందర్ నాయక్, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా మళ్లీ కొత్వాల

ఖమ్మం, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా వైస్ చైర్మన్ తూము వీరభద్రరావుకు మళ్లీ బాధ్యతలు అప్పగించనున్నారు. అలాగే ఖమ్మం డీసీఎంఎస్ వైస్‌చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు ఇవ్వనున్నారు. గతంలో వరంగల్ కో ఆపరేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు నిలిపివేయడంతో గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా తూము వీరభద్రరావుకు బాధ్యతలు ఇవ్వాల్సిందిగా జిల్లా సహకార అధికారి మురళీధరరావు సొసైటీ సీఈవోకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

ప్రస్తుతం ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా, గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా ఉన్న రాయల శేషగిరిరావు గతంలో డీసీసీబీకి డిఫాల్టర్‌గా ఉన్నారని, తీసుకున్న కారు రుణం సక్రమంగా చెల్లించడం లేదని పలు ఫిర్యాదులతో అప్పటి సహకార శాఖ అధికారి విజయకుమారి విచారణ నిర్వహించి సొసైటీ అధ్యక్షుడిగా తొలిగించి .వైస్‌చైర్మన్‌గా ఉన్న తూము వీరభద్రరావుకు బాధ్యతలు ఇచ్చారు. దీంతో రాయల శేషగిరిరావు సొసైటీ అధ్యక్ష పదవితో పాటు డీసీఎంఎస్ డైరెక్టర్, చైర్మన్ పదవులు కూడా కోల్పోయారు. అప్పుడు డీసీఎంఎస్ వైస్ చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ డీసీవో ఆదేశాలు జారీచేశారు. అయితే దీనిపై రాయల శేషగిరిరావు వరంగల్ కో ఆపరేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఆయననే కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఇప్పటి వరకు గంగదేవిపాడు సొసైటీ చైర్మన్‌గా, ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా రాయల శేషగిరిరావు కొనసాగుతూ వస్తున్నారు.

ఈ క్రమంలో వరంగల్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులపై గంగదేవిపాడు వైస్ చైర్మన్‌గా ఉన్న తూము వీరభద్రరావు హైకోర్టులో సవాల్ చేశారు.హైకోర్టు ఇటీవల వరంగల్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను పక్కనబెట్టింది. గతంలో డీసీవో ఇచ్చిన ఆదేశాలను అనుసరించి గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడిగా తూము వీరభద్రరావు, డీసీఎంఎస్ చైర్మన్‌గా కొత్వాల శ్రీనివాసరావు మళ్లీ కొనసాగబోతున్నారు.

కార్పొరేట్ శక్తుల కోసం పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు


సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 1: దశాబ్దాల పాటు కార్మికులు వేల పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ఒక్క గీతతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని, ఖనిజ సంపద నుంచి భీమా కంపెనీల వరకు ప్రభుత్వ రంగ సం స్థలను ప్రైవేటీకరణ చేసి కార్మికుల ఉనికినే ప్రశ్నార్థకం చేసే స్థాయిలో పదేళ్లలో మోదీ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అమలు చేశారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. బుధవారం మేడే దినోత్సవం సందర్భంగా ప్రజాపంథా కార్యాలయంలో జెండా విష్కర ణ చేసి అనంతరం నిర్వహించిన ఐఎఫ్‌టీయూ సభలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో రూ. వందల కోట్లు ఆదాయం ఉన్న కార్పొరేట్ శక్తులు రూ.లక్షల కోట్లకు పడగలేత్తారని, కార్మికులు మాత్రం ఆకలి, అవమానాలతో మరింత దారిద్ర్య రేఖకు దిగువకు చేరారని ధ్వజమేత్తారు. లాభాల్లో ఆదర్శవంతంగా కొనసాగుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వంలో కార్పొరేట్ శక్తులకు అప్పగించిందన్నారు. జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామయ్య, గుర్రం అచ్చయ్య, ఆవుల అశోక్, కే శ్రీనివాస్, శిరోమణి, ఝాన్సీ, ఆజాద్, మంగతాయి, శోభ, రమేశ్, జలగం రమేశ్ తదితరులున్నారు.

ప్రమాదంలో కార్మిక రంగం

- సీపీఐ జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, భాగం హేమంతరావు


కార్మిక జెండాను ఆవిష్కరణ చేస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 1: కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, అయితే ఈ దశలో కార్మికులు విప్లవ కార్యచరణ తప్పదని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా సీపీఐ జిల్లా సమితి కార్యాలయంలో పువ్వాడ నాగేశ్వరరావు ఏఐటీయూసీ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ కార్మిక శక్తి ఆజేయమైందన్నారు. సంపదను సృష్టించే కార్మిక రంగం లేకుండా కార్పొరేట్ శక్తులు నిలబడలేవని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను సైతం కార్పొరేటీకరణ జరుగుతున్న ఈ సమయంలో కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని, బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించటం ద్వారానే కార్మికుల హక్కుల పరిరక్షణ జరుగుతుందన్నారు. నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే జానిమియా, కనకం జనార్ధన్, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బీజే క్లైమెంట్, మహ్మద్ సలామ్, తోట రామాంజనేయులు, జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ముందస్తు పన్నుల ఆదాయం రూ.15.15కోట్లు

ఖమ్మంకార్పొరేషన్, మే1: ముందస్తు అస్తి పన్నుల ద్వారా ఉమ్మడి జిల్లాలో నగరపాలకసంస్థ, పురపాలక సంస్థలకు రూ.15.15కోట్ల ఆదాయం లభించింది. 2024-25 ఏడాదికి సంబంధించి గతనెల 30వ తేదీ వరకు 5శాతం రాయితీపై ముందస్తు ఆస్తి పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో గడువు ఆఖరు తేదీ మంగళవారం రాత్రి నాటికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఒక నగరపాలక సంస్థ, ఏడు పురపాలక సంస్థలకు కలిపి రూ.15.15కోట్ల ఆదాయం లభించింది.

మొత్తం 26,646 మంది వద్ద నుంచి అధికారులు ముందస్తు ఆస్తి పన్నులను వసూలు చేయగలిగారు. ఖమ్మం నగరపాలక సంస్థలో 14,527 మంది నుంచి రూ.9.73కోట్లు, సత్తుపల్లి పురపాలకం నుంచి 1,865 మంది నుంచి రూ.1.32కోట్లు, మధిర పురపాలకం నుంచి 1,625 మంది నుంచి రూ.58లక్షలు, వైరాలో 1,726మందినుంచి రూ.69లక్షలు, పాల్వంచలో 2,878మంది నుంచి రూ.1.07కోట్లు, ఇల్లెందులో 752 మంది నుంచి రూ.30లక్షలు, కొత్తగూడెంలో 2,174 మంది నుంచి రూ.1.07కోట్లు, మణుగూరు పురపాలకంలో 1,099 మంది నుంచి రూ.39లక్షలు ముందస్తు ఆస్తి పన్నుల ద్వారా ఆదాయం లభించింది.

నేడు భద్రాద్రి రామయ్యకు నూతన పర్యంకోత్సవం

- 13న శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ

భద్రాచలం, మే 1: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామికి గురువారం నూతన పర్యంకోత్సవాన్ని సంప్రదాయబద్దంగా నిర్వహించనున్నారు. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఏప్రిల్ 9 నుంచి మే ఒకటి వరకు పవళింపు సేవలు నిలిపివేశారు. ఈ క్రమంలో స్వామివారి కల్యాణం ఏప్రిల్ 17న నిర్వహించారు. కాగా సీతారాముల కల్యాణం జరిగిన 16వ రోజున నూతన పర్యంకోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉయ్యాలను సర్వాంగ సుందరంగా అలంకరించి పర్యంకోత్సవం నిర్వహించనున్నారు. దీంతో శుక్రవారం నుంచి ప్రతి రోజు స్వామి వారికి పవళింపు సేవలు నిర్వహిస్తారు.

వైశాఖ మాసోత్సవాలివే..

భద్రాచలంలో వైశాఖ మాసంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన వివరాలను వైదిక సిబ్బంది దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు. 8వ తేదీ నుంచి 12 వరకు భగవత్ రామానుజులవారి తిరు నక్షత్రోత్సవాన్ని నిర్వహించనున్నారు. 13న శ్రీరామపునర్వసు దీక్ష విరమణ, 14న శ్రీరామదీక్షితుల కోసం ప్రత్యేక పట్టాభిషేకం నిర్వహించనున్నారు. 19న సత్యనారాయణస్వామి వారి కల్యాణం, 22న నృసింహ జయంతి సందర్భంగా నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, 23న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వార్షిక తిరుకల్యాణం, 22న నమ్మాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నేషనల్ నెట్‌బాల్ జట్టుకు విజయ కళాశాల విద్యార్థి ఎంపిక


కార్తీకను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జాన్‌బాబు

కొణిజర్ల, మే1: కేరళలో ఈనెల 3 నుంచి 7 వరకు నిర్వహించే నే షనల్ లేవల్ నెట్‌బాల్ కు విజయ ఇంజనీరింగ్ క ళాశాల విద్యార్థి ఎ. కార్తీక ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాన్‌బాబు, కళాశాల పీడీ వెంకటస్వామి బుధవా రం తెలిపారు. కార్తీక జెఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ తరుపున కళాశాల నుంచి ఎంపికైనట్లు పేర్కొన్నారు. చిన్నతనం నుంచి కార్తీకకు నెట్‌బాల్ ఆటల్లో నైపుణ్యం ఉందని, దాంతోనే జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైందన్నారు. కళాశాల వైస్‌చైర్మన్ విజయలక్ష్మి, చిన్నయ్య, శ్రీనివాసరావు, వెంకటస్వామి, ఉపాధ్యాయులు కార్తీకను అభినందించారు.

చెక్‌డ్యాంను పరిశీలించిన జాయింట్ కమిషనర్

ఏన్కూరు, మే1: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన చెక్‌డ్యాంలను పంచాయతీరాజ్ శాఖ జాయింట్ కమిషనర్ శేషుకుమార్ బుధవారం పరిశీలించారు. తిమ్మారావుపేట, సూర్యతండలో వాటర్‌షెడ్ పథకం కింద నిర్మించిన చెక్‌డ్యాంలను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో శిరీష, ఏపీడీ వెంకటరాజు, ఎంపీడీవో ఎస్. రమేష్, ఏపీవో సూరయ్య, టీఏలు పాల్గొన్నారు.


చెక్‌డ్యాంలను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శేషుకుమార్

పోలింగ్ సమయం గంట పెంపు

- వేసవి నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిర్ణయం
- ఉదయం 7నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 4గంటల వరకే..



ఖమ్మం కలెక్టరేట్, మే 1: రాష్ట్రంలో వేసవి తీవ్రత నేపథ్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచుతూ జాతీయ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎండల ప్రభావం పోలింగ్‌పై పడి ఓటింగ్ శాతం తగ్గిపోతుందని అన్ని రాజకీయ పార్టీలు చేసిన విజ్ఞప్తి మేరకు ఎన్నికల పోలింగ్ సమయాన్ని గంట పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెంచిన సమయం ప్రకారం పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభమై సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రంలోకి 6గంటల వరకు ఓటర్లను అనుమతిస్తారు. ఇక నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే కొనసాగుతుంది. ఖమ్మం పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి సెగ్మెంట్లలో తాజాగా పెంచిన పోలింగ్ వ్యవధితో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. ఇక కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే కొనసాగుతుంది. పోలింగ్ వ్యవధిని గంట పెంచడం పట్ల అన్ని రాజకీయ పార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పెంచిన పోలింగ్ వ్యవధిపై ఎన్నికల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలి

● ఎస్పీ రోహిత్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెం, మే 1: పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. బుధవారం ఐఎంఏ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓటర్లందరూ మనోధైర్యంతో తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభపెడితే చట్టప్రకారం కేసులు నమోదు చేసి, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి ఎన్నికల సంఘం ప్రతి కదలికను నిశితంగా పరిశీలిస్తుందని అన్నారు. ఎన్నికల విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ తమ విధుల నిర్వహణలో అనుమానాలు ఉంటే అధికారుల వద్ద నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీలు రెహమాన్, సతీష్ కుమార్, రవీందర్ రెడ్డి, చంద్రభాను, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో వ్యవసాయ విద్యార్థుల ప్రతిభ


బహుమతులతో వ్యవసాయ విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, మే 1: ఖమ్మంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చూపి బహుమతులు గెలుపొందారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్‌ను నిర్వహించారు. పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన అమృతవర్ష, యమున, చిన్నారి పాల్గొని డబుల్స్ విభాగంలో ద్వితీయస్థానం, సింగిల్స్ విభాగంలో తృతీయ స్థానం సాధించారు. పురుషుల విభాగంలో అబ్రహం, చంద్రశేఖర్ డబుల్స్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. డాక్టర్ మధుసూధన్‌రెడ్డి, పీజికల్ డైరెక్టర్ రెహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆటల్లో విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

'కార్మికులు హక్కుల గురించి తెలుసుకోవాలి'

ఖమ్మం లీగల్, మే 1: ప్రతీ ఒక్క కార్మికుడు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, కార్మికులను ఉద్దేశించి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు తెలిపారు. మే 1న కార్మిక దినోత్సవం సందర్భంగా రోటరీనగర్ ఆటోయూనియన్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికారసంస్థ అందించే పథకాల గురించి వివరించారు. బాల కార్మికవ్యవస్థ రూపుమాపడం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వలరాజ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ టి.శ్రీను, గాంధీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖమ్మం క్రైం, మే 1: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. బాలపేటకు చెందిన ఆటో డ్రైవర్ అజ్మీర్‌శ్రీను తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని బాలపేట నుంచి ఖమ్మం వెళ్తుండగా బల్లేపల్లి సెంటర్ వద్ద ఇల్లెందు నుంచి ఖమ్మం వస్తున్న అశోక్‌లేలాండ్ వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

రూ.8.63లక్షల నగదు స్వాధీనం


మండలపల్లి ఎస్ఎస్‌ఎస్టీ చెక్‌పోస్టు వద్ద నగదును సీజ్ చేసిన పోలీసులు

దమ్మపేట/కారేపల్లి, మే 1: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం వేర్వేరు చోట్ల రూ.8.63లక్షలు పట్టుబడ్డాయి. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం మండలపల్లి ఎస్ఎస్‌ఎస్టీ చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.7,33,500లక్షలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు. మండలంలో పలు దుకాణాలలో సిగిరెట్లు విక్రయించే డిస్ట్రిబ్యూటర్ ఎటువంటి ఆధారాలు లేకుండా నగదును తన వాహనంలో తీసుకువెళుతుండగా పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళుతున్న ఇద్దరు వ్యకులు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1.30లక్షలను తరలిస్తుండగా కారేపల్లి ఎస్ఐ బి.రాజారామ్ స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ జూనియర్ డాక్టర్ మృతి


కృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గోపాల్‌రెడ్డి

కామేపల్లి, మే 1: కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మద్దినేని రమేష్ తనయుడు డాక్టర్ పవన్‌కృష్ణ(26) గత నెలలో విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మండలంలోని మృతుడి స్వగ్రామమైన పండితాపురానికి తీసుకువచ్చారు. మృతదేహాన్ని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు పోట్ల నాగేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు, మే 1: మండల కేంద్రమైన బూర్గంపాడు శివారులోని కిన్నెరసాని వాగు నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును బూర్గంపాడు పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి వాహనదారుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అప్పారావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

30లీటర్ల నాటుసారా...

దుమ్ముగూడెం, మే 1: మండల పరిధిలోని సుజ్ఞానపురానికి చెందిన భూక్యా నగేష్ నాటుసారా సరఫరా చేస్తూ బుధవారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్ఐ గణేష్ ఆధ్వర్యంలో చింతగుప్ప గ్రామశివార్లలో పోలీసు తనిఖీలు చేస్తున్న క్రమంలో రూ.9వేల విలువ గల 30 లీటర్ల నాటుసారా అతడి వద్ద దొరికింది. నిందితుడిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎక్స్‌కవేటర్, మట్టి టిప్పర్లు..

సత్తుపల్లిరూరల్, మే1: అక్రమంగా మట్టి తవ్వకాలు, తోలకాలు సాగిస్తున్న ఎక్స్‌కవేటర్‌తో పాటు మూడు మట్టి టిప్పర్లను పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పట్టణ శివారులోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు సాగిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. దాడుల్లో ఒక ఎక్స్‌కవేటర్, 3మట్టి టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

అశ్వాపురం, మే 1: ఇండియా కూటమి మహబూబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కమ్యూనిస్టులు, టీడీపీ, టీజేఎస్ మిత్రపక్షాలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసగించేందుకు పాట్లు పడుతున్నాయన్నారు. మతోన్మాద శక్తులను ఓడించేందుకు కాంగ్రెస్, మిత్రపక్షాలు కృషిచేయాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే మండలంలో ఇండియా కూటమికి మెజారిటీని తెప్పించటమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాశరావు, టీజేఎస్ నాయకుడు పగడాల కరుణాకర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

8

గురువారం 2 మే 2024

ఘనంగా మేడే వేడుకలు

పలు చోట్ల కార్యక్రమాల నిర్వహణ

వివిధ సంఘాల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు

కార్మికుల త్యాగాలను కొనియాడిన వక్తలు

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వివిధ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కార్మికుల త్యాగనిరతిని కొనియాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి



భద్రాచలం ఆర్టీసీ డిపోలో



ఇల్లెందులో జెండా ఎగురవేస్తున్న గుమ్మడి నర్సయ్య



'పేట'లో 1104 యూనియన్ ఆధ్వర్యంలో..



దమ్మపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో...



అశ్వాపురం సీపీఐ ఆధ్వర్యంలో..



మణుగూరులో నిర్వహించిన వేడుకలు

మాతాశిశు సంరక్షణలో భేష్

రాష్ట్రస్థాయిలో భద్రాద్రి జిల్లా ప్రథమ స్థానం

అభినందించిన ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి

భద్రాచలం, మే 1: మాతా శిశు సంరక్షణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్రస్థాయిలోనే మార్చి నెలలో ప్రథమ స్థానంలో నిలిచింది. భద్రాద్రి జిల్లా ఆవిర్భావం అనంతరం ఈ విభాగం రాష్ట్రస్థాయిలోనే వైద్య ఆరోగ్యశాఖ మాతా శిశు సంరక్షణలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొని రాష్ట్ర స్థాయిలోనే అత్యుత్తమ సేవలందించిన జిల్లాగా ఘనతి కెక్కింది. మార్చి నెలలో 1,543 మంది గర్భిణీలు నమోదు చేయించుకోగా మొదటి త్రైమాసికంలో 1,372 మంది నమోదు చేయించుకున్నారు. గర్భిణీల్లో మూడు చెకప్‌లు అందిన వారు 935 మంది ఉండగా, నాలుగు చెకప్‌లందిన వారు 912 మంది గర్భిణీలున్నారు. జిల్లాలోని మొత్తం ఆసుపత్రుల్లో చేసిన కాన్పులు 900 కాగా వీటిలో శస్త్ర చికిత్స కాన్పులు 469. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 657 కాన్పులు జరగ్గా ప్రభుత్వాసుపత్రుల్లో శస్త్ర చికిత్స ద్వారా 306 మంది గర్భిణీలకు కాన్పులు నిర్వహించారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో మొత్తం 197 కాన్పులు జరగ్గా అందులో శస్త్ర చికిత్స కాన్పులు 141.

కాన్పుల్లో అశ్వాపురం పీహెచ్‌సీ ప్రథమం

ఈ ఏడాది మార్చిలో జరిగిన కాన్పుల్లో అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ 12 మంది గర్భిణులకు కాన్పులు నిర్వహించారు. దుమ్ముగూడెంలో ఎనిమిది సత్యనారాయణపురం, మణుగూరు సులానగర్ లో ఏడు చొప్పున కాన్పులు చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంసీహెచ్ ప్రోగ్రామింగ్ అధికారి

కాగా నర్సాపురం, రాంపేడు, కొమరారంలో ఒకటి చొప్పున కాన్పు చేయగా మంగపేట, సుజాత్‌నగర్‌లో ఒక్క కాన్పు కూడా జరగకపోవడం గమనార్హం.

అభినందించిన ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని మాతా శిశు సంక్షేమ విభాగంలో నిర్దేశించిన సూచికల ప్రగతి సాధించి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య అధికారులను ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తూ, కమీషనర్ ఆర్‌వీ కర్ణన్‌లు అభినందించారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్యశాఖ సాధించిన ప్రగతి సమీక్ష సమావేశంలో భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శిరీష, మాతా శివు సంక్షేమ జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఆర్.చైతన్యలను వారు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు పోవాలని వారికి సూచించారు.

నేడు కాంగ్రెస్ గూటికి ఊకంటి

చుంచుపల్లి, మే 1: సీనియర్ నాయకులు ఊకంటి గోపాలరావు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. బుధవారం మండలంలోని విద్యానగర్ కాలనీలో గల ఈకే విద్యాలయం ప్రాంగణంలో ఐదు వేల మందితో పార్టీ చేరిక ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. గతంలో పొంగులేటికి ప్రధాన అనుచరుడిగా ఉన్న గోపాలరావు కాంగ్రెస్‌లోకి చేరుతుండడం భద్రాద్రి జిల్లాలో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరనుంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం టిక్కెట్ పొంగులేటికి కేటాయించకపోవడంతో మనస్థాపానికి గురైన గోపాలరావు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు.

ఇల్లెందులో ఆగని కేసీఆర్ బస్సు యాత్ర



బస్సులోనుంచి అభివాదం చేస్తున్న కేసీఆర్

ఇల్లెందుటౌన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం నుండి మహబూబాబాద్ వెళుతున్న మాజీ సీఎం కేసీఆర్ మార్గ మధ్యలోని ఇల్లెందులో ఆగకుండానే వెళ్లిపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరుత్సాహానికి గురైనారు. ఇల్లందులోని జగదాంబ సెంటర్‌లో 5 నిమిషాలు బస్సు యాత్రను ఆపేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. కేసీఆర్ ఇక్కడ ఆగనున్నట్లుగా ప్రకటించిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం సాయంత్రం సుమారు 6గంటల ప్రాంతంలో జగదాంబ సెంటర్‌కు చేరుకున్నపట్టికి ఆగకుండానే బస్సులో నుండి అభివాదం చేస్తు వెళ్లిపోయారు. కేసీఆర్ బస్సు యాత్ర సందర్భంగా ఇల్లందులో పోలీసులు భారీబందోబస్తు నిర్వహించారు.

కేసీఆర్‌ను కలిసిన నియోజకవర్గ నాయకులు

భద్రాచలం: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును భద్రాచలం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లిరాంప్రసాద్ కలిసారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు విశేష కృషి చేసినందుకు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కేసీఆర్ అభినందనలు తెలిపారు.

బూర్గంపాడు

ఇల్లందు సింగరేణి అతిథి గృహంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం బూర్గంపాడు జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జలగం జగదీష్, ఆళ్లపల్లి ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి, లక్ష్మీపురం మాజీ వార్డు సభ్యులు పాలం దివాకర్‌రెడ్డి, యువనేత యారం పున్నారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: పాయం

పినపాక, మే 1: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చడాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ అబద్ధపు, విష ప్రచారానికి పూనుకుంటోందని కాని వారి మోసపూరిత బూటకపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిని లేదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్లోని జీవీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, గత పది ఏండ్లలో ఫాం హౌస్ నుంచి బయటకు రాని కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు రోడ్ షోలతో రోడ్డున పడ్డాడన్నారు. ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుని, బీజేపీకి తాకట్టు పెట్టి, కూతురును బయటకు తెచ్చుకునే ప్రయత్నాల్లో బీఆర్ఎస్ పార్టీ ఉందన్నారు. ఆయా పార్టీల ఎత్తుగడలను తిప్పి కొట్టాలని, ప్రతి గ్రామంలో బూత్ స్థాయిలో కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, టీడీపీ మిత్రపక్షాలను కలుపుకుని గతంలో ఎన్నడు లేని విధంగా భారీ మెజార్టీతో గెలిపించేందుకు కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు పోరిక సాయిరాం శంకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం, జిల్లా నాయకులు చందా సంతోష్, కాటిబోయిన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు బి.అయోధ్యా చారి, టీడీపీ రాష్ట్ర నాయకులు పోటు రంగారావు, వాసిరెడ్డి చలపతిరావు, టీడీపీ మండలాధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, తాళ్లూరి జగదీశ్వరరావు, సీపీఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, నిమ్మల వెంకన్న, సీపీఐ నాయకులు మనోహరాచారి, పి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

కరకగూడెం: త్వరలో రగనున్న పార్లమెంట్ ఎన్నికలలో మహబూబాబాద్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని బలరాం నాయక్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మానుకోట గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగరడం బలరాముడి గెలుపుతో పాటు రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం ఖాయమన్నారు. కుల మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సూచిస్తున్న బీజేపీ పార్టీకి బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటితో ఎంపీ అభ్యర్ధిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిత్ర పక్షాల నాయకులు అయోధ్య, చలపతిరావు, రంగరావు, చందా సంతోష్‌కుమార్, మాజీ సర్పంచులు పోలెబోయిన శ్రీవాణి, కుంజ వసంతరావు, నాగేశ్వరావు, పాయం లక్ష్మీనారాయణ, పోలెబోయిన తిరుపతయ్య, సిరిశెట్టి కమలాకర్, నాగబండి వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పినపాక సమావేశంలో మాట్లాడుతున్న పాయం

'త్రివేణి' విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలం, మే 1: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన త్రివేణి పాఠశాల విద్యార్థులు పారెల్లి భవ్య శ్రీ, కర్రీ రుచిత, రేఖ తేజస్వినిలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అభినందించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వారిని శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ త్రివేణి విద్యా సంస్థలు ఉన్నత విలువలతో కూడిన విద్యనందిస్తున్నాయని కొనియాడారు. పదిపాయింట్లు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఇన్‌చార్జ్ బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమలాదేవి, ఉపాధ్యాయుడు నరేష్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న పీవో

మణుగూరు, మే 1: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లుకు మణుగూరులోని ప్రభుత్వ జూనియర్ కాలేజిలో శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలు, ఓటింగ్ ప్రక్రియలో తలెత్తే సమస్యలు వాటి పరిష్కారాలు, ఈవీఎం మిషన్లు పనితీరు సమస్యల పరిష్కారాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ శిక్షణ తరగతులను పరిశీలించడమే కాకుండా మధ్యాహ్నం వరకు శిక్షణ పొందిన వారిని పలు అంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం ఈవీఎంలపై పీవో అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. పోలింగ్ అధికారుల బాధ్యతలు విధులను కూడా రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు అశ్వాపురం, గుండాల, తహశీల్దార్లు, రాఘవరెడ్డి, సత్యనారాయణ, స్వర్ణ ఇమానియల్, ఎంఈవో వీరస్వామి, మాస్టర్ ట్రైనీలు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

డివిజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

మణుగూరు, మే 1: భానుడి ప్రతాపం బుధవారం తీవ్రంగా పెరిగింది. దీంతో మణుగూరు డివిజన్‌లో మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల ప్రజలు భరించలేని వేడిమికి గురయ్యారు. జిల్లాలో గరిష్ఠంగా ఉష్ణోగ్రత పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో నమోదు అయినట్లు అధికారులు ధృవీకరించారు. నిప్పులకొలిమిగా మారిన మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లో ప్రధాన రహదారులతో పాటు అనుసంధాన వీధులు కూడా నిర్మానుష్యంగా మారాయి. మణుగూరు డివిజన్‌లోని ఏడూళ్లబయ్యారం 28.7 డిగ్రీల నుంచి 44.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా అశ్వాపురం 44.4, కరకగూడెం 43.7 మణుగూరు 43.7 భద్రాచలం 43.1 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే 28 డిగ్రీలను నమోదు చేసుకోవడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వచ్చేందుకు సాహసించలేకపోయారు. భరించలేని వేడి, వడగాలులు నిప్పులను మీద కుమ్మరించినట్లు గా అనుభూతి చెందారు. వామ్మో ఇవేం ఎండలు బాబోయ్ అంట హడలిపోయారు. అత్యవసర పరిస్థితుల్లో పట్టణానికి వచ్చేవారు క్యాపులు, నీటితో తడిపిన కండువాలను తలలకు చుట్టుకోని రాకపోకల్ని సాగించారు. సాయంత్రం వరకు ఉష్ణోగ్రతల్లో తగ్గుముఖం పట్టకపోవడంతో ప్రజలు తీవ్ర స్థాయిలో భయాందోళనలను వ్యక్తం చేశారు. పండ్ల రసాలు, కొబ్బరి బోండాలు తాగుతూ ఉపశమనాన్ని పొందే ప్రయత్నాలు చేశారు. మే తొలి రోజే ఈ రకంగా గరిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ప్రజలను ఆందోళనకు గరిచేస్తోంది. వీచే పెను వడగాలులు భరించలేని వేడిమిలో రాకపోకల్ని సాగించకుండా ఇంటిపట్టునే ఉండటం ఆరోగ్యానికి మంచిదని డాక్టర్‌లు పేర్కొంటున్నారు.

బీఎస్సీలో కాలేజీ టాపర్‌గా ప్రవళ్లిక

మణుగూరు, మే 1: సికింద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో బీఎస్సీ పూర్తి చేసిన మణుగూరు చెందిన కొత్తపల్లి ప్రవళ్లిక కాలేజి టాపర్‌గా నిలిచింది. మణుగూరు ప్రాంతానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కొత్తపల్లి అశోక్, అంగన్‌వాడీ టీచర్ సుజాత దంపతుల కుమార్తె ప్రవళ్లిక బుధవారం యూనివర్సిటిలో జరిగిన కార్యక్రమంలో కాలేజి టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్‌తో పాటు ప్రసంశాపత్రాన్ని అందుకొంది. రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ ఆర్.లింబాద్రి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుంది. సికింద్రబాద్‌లోని పద్మరావునగర్‌లో సర్దార్ పటేల్ కాలేజి తరుపున తమ కుమార్తె చదువుల్లో రాణిస్తూ కాలేజి టాపర్‌గా నిలవడం తమకెంతో సంతోషంగా ఉందని కొత్తపల్లి అశోక్ తెలిపారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రవళ్లిక

కార్మికుల హక్కులను రక్షించుకుందాం

చుంచుపల్లి, మే1: కార్మికుల హక్కులను రక్షించుకుందామని జీఎస్ఆర్ ట్రస్ట్ కో-ఆర్డీనేటర్ మోదుగు జోగారావు అన్నారు. బుధవారం పట్టణంలోని రైటర్ బస్తీలో గల జీఎస్ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న ట్రస్ట్ సభ్యులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా కో-ఆర్డీనేటర్ మాట్లాడుతూ జీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆదేశాలనుసారం బిఆర్ .అంబేద్కర్ భారత్ రాజ్యాంగంలో కార్మికుల కోసం పొందుపరిచిన కార్మిక హక్కుల గురించి వివరిస్తూ వాటిని కాపాడుకునేందుకు కృషి చేయాలని అన్నారు. అనంతరం ప్రతి ఒక్కరికి కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి అంజి. సభ్యులు డివిఎస్ఎన్‌ప్రసాద్, కంకణాల ఉజ్జీవ్‌రావు, కె.దివ్యా, యం.బిందు, యల్. అనూష, ఎం. కోటేశ్వరీ, కె.నవ్యా, ఎల్.నరేష్, ఎం.రామరాజు, బి.రమేష్, ఎం.రాజేష్, ఎల్. రమేష్, కె.హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డి విజయం పక్కా: చిన్ని



ప్రచారం నిర్వహిస్తున్న కోనేరు చిన్ని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 1: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కొత్తగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి కాంగ్రెస్ అభ్యర్థి పోస్టర్లను పంపిణీ చేసి ఎంపీగా రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల ప్రచారంలో భద్రాద్రి జిల్లా మహిళ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఆళ్ల మురళీ, జెవిఎస్ చౌదరి, లక్ష్మణ్ అగర్వాల్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

జూలూరుపాడు, మే 1: మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ నీటి సమస్యను పరిష్కరించటంలో అధికారులు విఫలమయ్యారన్నారు. నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

నత్తనడకన అమ్మ-ఆదర్శ పాఠశాల పనులు

జూలూరుపాడు, మే 1: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మ-ఆదర్శ పాఠశాల పథకం కింద మండలంలో పాఠశాలల్లో చేపడుతున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు చేపట్టేందుకు కేటాయించిన నిధులు మాత్రం సంబంధిత పాఠశాలల ఖాతాలలో జమకాకపోవటంతో కొన్ని చోట్ల పనులు ప్రారంభమై మందకొడిగా సాగుతుండగా మరికొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభంకాలేదు. యూడైస్ ఆధారంగా పాఠశాలల్లో అవసరాలను గుర్తించి పనులను చేపడుతున్నారు. స్వయం సహాయక సంఘానికి చెందిన గ్రామ సమాఖ్యను అమ్మ-ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కన్వీనర్‌గా నియమించి బ్యాంక్ ఖాతాలను తెరిచారు. జూలూరుపాడు మండలంలో అమ్మ-ఆదర్శ పాఠశాల కింద తొలి విడతలో 25 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు రూ. 1.01 నిధులను కేటాయించారు. ఈ నిధులను కమిటీల తీర్మానంతో పాఠశాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు చిన్నచిన్న పనులను చేపట్టి పాఠశాలలను ఆధునికరించాల్సి ఉంది. కాగా ఈ పథకం కింద కొన్ని పాఠశాలల్లో పనులు ప్రారంబించి నిలిపివేశి నిధుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. జూలూరుపాడు ఉన్నత పాఠశాల, రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలల్లో పనులు ప్రారంభించకపోవటం గమనర్హం.

ముంచుకొస్తున్న గడువు..

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మే 5వ తేదీ నాటికి పనులను పూర్తిచేయాలని, మిగత పాఠశాలల్లో మే 30వ తేదీ నాటికి పనులను పూర్తిచేయాలని అధికారులు కాంట్రాక్టర్లను ఆదేశించారు. గడువు సమీపిస్తుండటంతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు కమిటీల, కాంట్రాక్టర్లపై ఒత్తిడిని పెంచుతున్నారు. అప్పులు చేసి తాము పనులను చేపట్టాలేమని కొన్ని పాఠశాలల్లో పనులను చేపడుతున్న స్వయం సహాయక సంఘాలలోని సభ్యులు అంటున్నారు. నిధులు మంజూరు చేయకుండా హడావుడి చేస్తే పనులను ఎలా చేపట్టాలని కాంట్రాక్టర్లు అంటున్నారు. పనులు చేపట్టేందుకు ఆసక్తి కనబరచకపోవటంతో కొన్ని చోట్ల పనులు ముందుకు సాగటంలేదు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే గడువులోగా అమ్మ-ఆదర్శ పాఠశాల పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించటంలేదు. పాఠశాలకు సంబంధించిన నిధులను రెండు రోజుల్లో ఖాతాలలో జమయ్యేలా చర్యలు చేపడతామని ఈడబ్ల్యూఐడీసీ ఏఇ రాంకుమార్ తెలిపారు.



జూలూరుపాడు పాఠశాలలో పనులు ప్రారంభంకాని దృశ్యం